
పోటీలను తిలకిస్తున్న మధుయాష్కీగౌడ్, సినీ హీరో సుమన్

బీసీసీఐ నిధులను ఇతర క్రీడలకు కేటాయించాలి

● టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్

ఎల్‌బీనగర్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): బీసీసీఐ నిధులను ఇతర క్రీడలకు మళ్లించి క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన అవసరముందని, ఇందుకు తన వంతు కృషి చేస్తానని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. హీరో సుమన్ 50ఏళ్ల నట జీవితాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో సుమన్ తల్వార్ లెజెండరీ కప్-2025 పేరిట తెలంగాణ స్టేట్ లెవెల్ ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా మధుయాష్కీ, సుమన్ హాజరయ్యారు. మధుయాష్కీ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తూ క్రీడలను ప్రోత్సహిస్తుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను గుర్తించి చేయూతనిచ్చేందుకు ప్రభుత్వం ఉందని చెప్పారు.



జస్టిస్ సూరేపల్లి నందాను సన్మానిస్తున్న ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ శాఖ మహిళా విభాగం సభ్యులు

మహిళా రిజర్వేషన్లను సద్వినియోగం చేసుకోండి

● హైకోర్టు జస్టిస్ సూరేపల్లి నందా

మన్సూరాబాద్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): లింగ అసమానతలను రూపుమాపేందుకు భారత ప్రభుత్వం స్థానిక ప్రభుత్వ స్థానాలలో మహిళలకు రాజకీయ రిజర్వేషన్లను కల్పించిందని, దీనిని మహిళా లోకం సద్వినియోగం చేసుకుని పురుషులతో సమానంగా అన్నిరంగాలలో రాణించాలని ప్రముఖ హైకోర్టు జస్టిస్ సూరేపల్లి నందా పేర్కొన్నారు. ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ శాఖ మహిళా విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ సంబరాలు నాగోల్‌లోని పీబీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జస్టిస్ సూరేపల్లి నందా, ఐవీఎఫ్ న్యూఢిల్లీ అధ్యక్షుడు అశోక్ అగర్వాల్, ఐవీఎఫ్ న్యూఢిల్లీ సలహాకమిటీ చైర్మన్ గంజి రాజమౌళి, ఐవీఎఫ్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్తాలు విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సృష్టికి మూలం మహిళే అని, తమ శక్తి తాము గుర్తించి అన్ని రంగాలలో తమ సత్తా చాటాలని సూచించారు. ఈ వేడుకలో భాగంగా చేపట్టిన పలు ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్తా, మొగుళ్లపల్లి ఉపేందర్‌గుప్తా, గౌరిశెట్టి ప్రభాకర్, పోలా విజయ్‌కుమార్, కర్నాటి విజయ్‌కుమార్‌గుప్తా, ఎంఎల్ఆర్ గుప్తా, ఎల్‌వీ కుమార్, మల్లికార్జునగుప్తా, టంగుటూరి రామకృష్ణ, రమేష్‌గుప్తా, సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు, యాంకర్లు ఎస్ఎస్ కపుల్, కవిరాజు కపుల్, నటి సంధ్యా జానక్, డైరెక్టర్ రమ్యశ్రీ, లక్ష్మీవర్మ, చంచల్‌శర్మ, నటి సన, మిస్ తెలంగాణ సుప్రజారెడ్డి, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ సుందరాచార్యులు తదితరులు

సహృదయ సుందరం, గురుపరంపర పుస్తకావిష్కరణ

సైదాబాద్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఉభయ వేదాంత పండితులు, సాహితీ వేత్త డాక్టర్ కె.వి.సుందరాచార్యులు 90వ తిరు నక్షత్ర(జన్మదిన) మహోత్సవ అభినందన సభ ఆదివారం సైదాబాద్ కాలనీ రామాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరాచార్యులు రచించిన సహృదయ సుందరం, గురుపరంపర పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. అధ్యయనం, అధ్యాపన, ఆచరణ మేళవింపుతో ఆదర్శ వ్యక్తిత్వం కలిగిన మహాపురుషులు సుందరాచార్యులని పలువురు వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో వేదాంత పండితులు కె.పరకాలన్‌స్వామి, తెలంగాణ విశ్వవిద్యాలయం తెలుగు ఆచార్యులు లక్ష్మణ చక్రవర్తి, సారస్వత పరిషత్ పూర్వ ఆచార్యులు చంద్రశేఖర్‌రెడ్డి, నరహరి, కుటుంబ సభ్యులు, అభిమానులు, శిష్యులు పాల్గొన్నారు.


ప్రగతినగర్ కాలనీలో నూతన రోడ్డును ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

రూ.23లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభం

హయత్‌నగర్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ ఏరియాలోని శ్రీదుర్గానగర్‌కాలనీ, శివంహిల్స్‌కాలనీ నుంచి ప్రగతినగర్, ప్రియదర్శినికాలనీ మీదుగా కుంట్లూర్ రోడ్డును కలిసేందుకు రూ23లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డుకు కార్పొరేటర్ కొప్పుల నరసన్న రోడ్డుగా నామకరణం చేశారు. ఆదివారం కార్పొరేటర్ నర్సింహారెడ్డి 15కాలనీల సంక్షేమ సంఘం నాయకులతో కలిసి రోడ్డును ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ దాదాపు 20 సంవత్సరాలుగా సరియైన రోడ్డు మార్గంలేక 15 కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని అన్నారు. రోడ్డుకు తన పేరు పెట్టినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పలు కాలనీల సంక్షేమ సంఘం అధ్యక్షులు పాల్గొన్నారు.


వివాహ వేడుకల్లో కార్పొరేటర్ శ్వేతామధుకర్ రెడ్డి

వైదేహి ఆశ్రమంలో ఆదర్శ వివాహం

సైదాబాద్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): సైదాబాద్ సరస్వతీనగర్‌లోని వైదేహి అనాథ ఆశ్రమ యువతి రాజేశ్వరీతో సాయిప్రసన్నకుమార్‌కు హిందూ సంప్రదాయ పద్ధతిలో ఘనంగా వివాహం జరిపించారు. ఈ వేడుకలకు కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి వస్త్రాలు బహూకరించారు. కార్యక్రమంలో అఖిల భారత వనవాసి సంఘటనా మంత్రి రామచంద్రయ్య, దక్షిణ, మధ్యక్షేత్ర ఆవాసాల ప్రముఖ్ రామాచారి, వ్యవస్థా ప్రముఖ్ తిరుమలజీ, సంఘకార్యకర్తలు, సేవికాసమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

తాగునీటి తిప్పలు

● సింగరేణి గుడిసెవాసుల కష్టాలు

● 28 ఏళ్లుగా ఉచిత ట్యాంకర్లే దిక్కు

● కోర్టు తీర్పు వంకతో వేయని మంచినీటి పైప్‌లైన్లు


బస్తీలో రోడ్లపై నిల్వ చేసిన నీటి డ్రమ్ములు


ఉచిత ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుంటున్న గుడిసెవాసులు

సైదాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): వేసవి ముందే సింగరేణి కాలనీ బస్తీలో తాగునీటి కష్టాలు ప్రారంభమయ్యాయి. నగరంలోనే అదో పెద్ద బస్తీల్లో ఒకటి ఐఎస్‌సదన్ డివిజన్‌లోని సింగరేణికాలనీ బస్తీ. ఈ బస్తీలో నిత్యం కూలీ నాలీ చేసుకునే నిరుపేదలు మాత్రమే ఉంటారు. అలాంటిది మంచినీళ్ల కోసం పనులు మానుకొని తంటాలు పడుతున్నారు. ఈ గుడిసెలలో సుమారు 13వేల కుటుంబాలు 28ఏళ్లుగా నివసిస్తున్నాయి. ఇందులో అత్యధిక శాతం గిరిజన, దళిత, మైనార్టీ పేద కుటుంబాలే. గత ప్రభుత్వం మురికివాడలు, బస్తీలలో రూ.1కే నల్లా పథకం ప్రవేశపెట్టి గ్రేటర్‌లో అన్ని ప్రాంతాల్లో కనెక్షన్లు ఇచ్చి ఉచిత నీటి సరఫరా చేస్తోంది. కానీ సింగరేణి గుడిసెలలో కోర్టుతీర్పు సాకుతో అధికారులు తాగునీటి కనెక్షన్లు ఇవ్వకపోవడంతో జలమండలి ఉచిత ట్యాంకర్లే దిక్కుగా మారింది. రెండు రోజులకొకసారి వచ్చే ట్యాంకర్ ఒక్కో ఇంటికి కేవలం ఒక డ్రమ్ము మాత్రమే నీటిని అందిస్తున్నారు. డ్రమ్ముల్లో పోసిన నీటిని మోటర్లను బిగించి ఇళ్లకు పైప్‌ల ద్వారా నీటిని తరలిస్తున్నారు. సుమారు రూ.10 నుంచి 12లక్షలు ట్యాంకర్ల యజమానులకు జలమండలి అధికారులు చెల్లిస్తున్నారు. కేవలం ఒకేసారి రూ.20-30లక్షల వ్యయంతో గుడిసెల ప్రాంతంలో నీటి కనెక్షన్లు ఇస్తే తాగునీటి సమస్య తీరుతుంది. దీంతో జలమండలికి నెలవారీగా ఆదాయం మిగులుతుంది. అదే జలమండలి శాఖ నీటి కనెక్షన్లు ఇవ్వకుండా డ్రైనేజీ పైప్‌లైన్లు వేయడం గమనార్హం. కోర్టుతీర్పు తాగునీటి పైప్‌లైన్ల విషయంలో వర్తిస్తుందా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

పేదలకు మౌలిక సదుపాయాలు కల్పించాలి



సింగరేణి గుడిసెల ప్రాంతంలో పేద ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. కానీ అధికారులు స్వప్రయోజనాలతో అమలు చేయడం లేదు. దీంతో పేదలు మంచినీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇంటింటికీ నీటి కనెక్షన్ ఏర్పాటు చేస్తేనే తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

- కొర్ర మోతీలాల్‌నాయక్, అధ్యక్షుడు, సేవాలాల్ బంజారా సంఘం

ఉచిత ట్యాంకర్ల సంఖ్య పెంచాలి



వేసవి ఆరంభంలోనే గుడిసెవాసులకు ఉచిత ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా చేస్తున్నా సరిపోవడం లేదు. కూలీ పనులు చేసుకునే పేదలు తాగునీటి ట్యాంకర్ల కోసం పనులు వదులుకొని ఎదురు చూడాల్సి వస్తుంది. గుడిసెవాసుల అవసరాలకు అనుగుణంగా ఉచిత ట్యాంకర్ల సంఖ్య పెంచాలి.

- సక్రీబాయి, గిరిజన సంఘం, సింగరేణికాలనీ

యుద్ధప్రాతిపదికన నీటి కనెక్షన్లు ఇవ్వాలి



కోర్టు తీర్పు సాకు చూపుతూ జలమండలి అధికారులు తాగునీటి కనెక్షన్లు ఇవ్వకపోవడం దారుణం. 28 ఏళ్లుగా ఉచిత ట్యాంకర్లపైనే ఆధారపడి ఉన్నారు. గ్రేటర్‌లోని అన్ని వాడలకు తాగునీటి, విద్యుత్, డ్రైనేజీ కనెక్షన్లు ఇచ్చారు. కానీ సింగరేణి గుడిసెలకు అధికారులు ఉద్దేశపూర్వకంగా కాంట్రాక్టర్ల ప్రయోజనం చేకూరేవిధంగా పైప్‌లైన్లు వేయడం లేదు. ఇప్పటికైనా తాగునీటి కనెక్షన్లు మంజూరు చేయాలి.

- జంగం శ్వేతారెడ్డి, కార్పొరేటర్, ఐఎస్‌సదన్ డివిజన్

జీఓ 118 బాధితుల సమస్యలను పరిష్కరిస్తాం : మల్‌రెడ్డి

మన్సూరాబాద్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు చిన్న, పెద్ద తేడా లేకుండా అన్ని వయస్సుల వారికి విజ్ఞానాన్ని పెంపొందించే వేదికలని రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి హామీ ఇచ్చారు. నాగోల్ డివిజన్ శ్రీసాయినగర్ సీనియర్ సిటిజన్స్ ఫోరం భవనంలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయం, రీడింగ్ హాలును ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన స్థానిక కార్పొరేటర్ చింతల అరుణతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ నాగోల్‌లోని 44 కాలనీవాసులు జీఓ 118తో ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. కాలనీవాసులంతా కలసికట్టుగా ఉంటూ తమ తమ ప్రాంతాల్లో నెలకొనే సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. శ్రీసాయినగర్ సీనియర్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఫోరం అధ్యక్షుడు దయానందరెడ్డి, జనరల్ సెక్రటరీ జె.రామచంద్రారెడ్డి, ఉపాధ్యక్షులు పాండురంగాచారి, పి.నాగేంద్రప్రసాద్, డాక్టర్ జేఎస్ ప్రసాద్, సాయినగర్ సౌత్ కాలనీ అధ్యక్షుడు బద్దం భాస్కర్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.


కాలనీవాసులతో మాట్లాడుతున్న మల్‌రెడ్డి రాంరెడ్డి

సీనియర్ సిటిజన్స్ వర్సెస్ సౌత్ కాలనీ అసోసియేషన్

తమకు సమాచారం ఇవ్వకుండా సీనియర్ సిటిజన్స్ ఫోరం భవనంలో గ్రంథాలయం, రీడింగ్ హాలు ప్రారంభించుకోవడమేమిటని శ్రీసాయినగర్ సౌత్ కాలనీ అసోసియేషన్ సభ్యులు శ్రీసాయినగర్ సీనియర్ సిటిజన్స్‌ఫోరం సభ్యులతో వాగ్వాదానికి దిగారు. దీంతో మల్‌రెడ్డి ఇరువర్గాలను సముదాయించడంతో కార్యక్రమం సజావుగా సాగింది.

భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

● సీఎం రేవంత్‌రెడ్డికి, డీజీపీకి బాధిత రైతులతో కలిసి న్యాయవాది రాపోలు భాస్కర్ ఫిర్యాదు

చాదర్‌ఘాట్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): నిరుపేద రైతుల వ్యవసాయ భూములను అక్రమంగా ఆక్రమించుకుని వెంచర్లుగా మార్చి భయభ్రాంతులకు గురిచేస్తున్న బట్టర్ ఫ్లై రియల్ ఎస్టేట్ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధిత రైతుల తరఫున హైకోర్టు న్యాయవాది రాపోలు భాస్కర్ డిమాండ్ చేశారు. ఆదివారం మలక్‌పేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి, డీజీపీకి బట్టర్ ఫ్లై రియల్ ఎస్టేట్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధిత రైతులు మల్కేడి వెంకటకిషన్‌జీ, మంచుకొండ హైమావతి, నైనావత్ చంద్రునాయక్, జటావత్ రాములుతో కూడిన బృందం ఫిర్యాదు చేసినట్లు వివరించారు. ఈ రియల్ ఎస్టేట్ దౌర్జన్యాలకు సహకరిస్తున్న ఆమన్‌గల్ మున్సిపాలిటీ అధికారులు, రెవెన్యూ, పోలీసు అధికారులు, భూములను పరిశీలించకుండా వెంచర్లకు అనుమతిచ్చిన డీటీసీపీ అధికారులపై న్యాయవిచారణ జరిపి నిరుపేద రైతులకు జరుగుతున్న అన్యాయాలను బహిర్గతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేవలం సర్వే నంబర్లను అడ్డుపెట్టుకుని నిరుపేద రైతుల భూములను దౌర్జన్యాలతో ఆక్రమించి డీటీసీపీ అధికారులకు తప్పుడు పత్రాలను చూపించి వెంచర్లకు అనుమతి తెచ్చుకుని ప్లాట్లను అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లా ఆమన్‌గల్, కడ్తాల్‌లో ఈ రియల్ ఎస్టేట్ యాజమాన్యం వెంచర్లు చేస్తూ ఏకంగా పోలీస్‌స్టేషన్ నిర్మాణానికే ఇక్కడి అక్రమ నిధులను వెచ్చించి అటు పోలీసులను, ఇటు రెవెన్యూ అధికారులను తమకు అనుకూలంగా మలచుకుని నిరుపేద రైతులపై దౌర్జన్యాలకు పాల్పడుతుందని ఆయన వివరిస్తూ వీటిని ఎదురించిన గిరిజన రైతు నైనావత్ చంద్రునాయక్‌పై అక్రమంగా 20 దొంగతనాల కేసులను పెట్టించి వేధిస్తున్నారన్నారు. వెంచర్‌కు చుట్టూ ఫెన్సింగ్ వేసి అందులో మధ్యలో ఉన్న దళిత రైతు మల్కేడి వెంకటకిషన్‌జీకి చెందిన 3ఎకరాల భూమిలోకి వెళ్లకుండా గేటుకు తాళం వేశారన్నారు. కోట్లాది రూపాయల విలువ గల నిరుపేద రైతుల భూములను పరిరక్షించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి విచారణకు ఆదేశించి వాస్తవాలను బయటపెట్టాలని న్యాయవాది రాపోలు భాస్కర్ బాధిత రైతుల తరఫున విజ్ఞప్తి చేశారు.


బాధిత రైతులకు జరిగిన అన్యాయాన్ని ఫొటోల్లో చూపిస్తున్న న్యాయవాది రాపోలు భాస్కర్

రాత్రి వేళల్లో చేయాల్సిన సీవరేజీ పనులు పగలా..

● మలక్‌పేటలో భారీగా ట్రాఫిక్ జామ్

చాదర్‌ఘాట్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మలక్‌పేట నల్గొండ చౌరస్తా సమీపంలో ప్రధాన రహదారిపై పాడైన సీవరేజీ క్లీనింగ్ మ్యాన్ హోల్ పునర్నిర్మాణ పనులు రాత్రి వేళల్లో చేయాల్సింది పోయి పగలు నిర్వహించడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మలక్‌పేట నల్గొండ చౌరస్తా నుంచి చాదర్‌ఘాట్‌లోని మలక్‌పేట రైల్వే ఆర్‌యూబీ వైపు వెళ్లే ప్రధాన రహదారిపై సీవరేజీ క్లీనింగ్ పనులను జలమండలి అధికారులు ఆదివారం చేపట్టారు. సీవరేజీ మ్యాన్‌హోల్ వద్ద పనులు చేస్తున్న సిబ్బందికి ఎలాంటి ఆటంకం కలుగకుండా ఉండేందుకు మ్యాన్‌హోల్ చుట్టూ బారికేడ్లను ఏర్పాటు చేశారు. అసలే ఇరుకుగా ఉండే ఈ రోడ్డుపై సీవరేజీ క్లీనింగ్ కారణంగా ప్రధాన రహదారి మరింత ఇరుకుగా మారడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఒక దశలో భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడి మలక్‌పేట నల్గొండ చౌరస్తా నుంచి ఇటు దిల్‌సుఖ్‌నగర్ వైపు, అటు సైదాబాద్ రోడ్డు వరకు భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఒకవైపు తీవ్ర రూపం దాల్చిన ఎండ వేడిమి, మరో వైపు నిలిచిపోయిన వాహనాలతో ద్విచక్రవాహనదారులు పడిన ఇబ్బందులు వర్ణనాతీతం. ప్రధాన రహదారులపై సీవరేజీ క్లీనింగ్, మ్యాన్‌హోల్ పునరుద్ధరణ పనులు చేయాల్సింది పోయి పగలు చేపట్టడం వల్లే భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు.


వెళ్లేందుకు వీలులేక మలక్‌పేటలో నిలిచిపోయిన వాహనాలు


సీవరేజీ పనులు చేపట్టే సిబ్బందికి ఆటంకం కలుగకుండా మలక్‌పేట ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన బారికేడ్లు

నేడు నేషనల్ మిల్లెట్ కిసాన్ మేళా-ఇండస్ట్రీ మీట్


రాజేంద్రనగర్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్ సెంటర్

రాజేంద్రనగర్ : 2047 నాటికి వికసిత్ భారత్‌గా దేశం రూపుదిద్దుకోవాలంటే అన్ని రంగాలు అభివృద్ధి చెందాలనే ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆశయాలకనుగుణంగా ఈనెల 3వ తేదీన నేషనల్ మిల్లెట్ కిసాన్ మేళా-ఇండస్ట్రీ మీట్ నిర్వహిస్తున్నట్లు ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్(ఐఐఎంఆర్) డైరెక్టర్ డాక్టర్ తారా సత్యవతి తెలిపారు. ఐఐఎంఆర్ గ్లోబల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆన్ మిల్లెట్స్ సహకారంతో రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆవరణలో జాతీయ చిరుధాన్యాల కిసాన్ మేళా, ఇండస్ట్రీ మీట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ మేళాలో చిరుధాన్యాల ఉత్పత్తుల స్టాళ్లు, ఉత్పత్తిదారులు, కొనుగోలుదారుల సమావేశాలు, ప్యానెల్ డిస్కషన్స్ ఉంటాయన్నారు. మేళాలో వివిధ ప్రాంతాలనుంచి రెండు వేల మంది చిరుధాన్యాలు పండించే రైతులు హాజరవుతారన్నారు. మిల్లెట్ ఫార్మర్స్ ప్రొడ్యుసర్ ఆర్గనైజేషన్‌లు, మహిళ స్వయం సహాయక సంఘాలు, శాస్త్రవేత్తలు, పాలసీ మేకర్స్, వ్యవసాయ రంగ నిపుణులు, చిరుధాన్యాల రంగంలో పనిచేస్తున్న వారు పాల్గొంటారన్నారు. భవిష్యత్ తరాలకు పౌష్టికాహారంతో పాటు అనారోగ్య సమస్యలు లేని జీవితం కావాలంటే చిరుధాన్యాల ఆహార ఉత్పత్తులతోనే సాధ్యమని ఆమె తెలిపారు. అందుకే ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఒక్కరూ చిరుధాన్యాల వైపు చూస్తున్నారన్నారు. చిరుధాన్యాల ఆహార పదార్థాలు వివిధ రకాల వ్యాధులను నయం చేస్తుందన్నారు. చిరుధాన్యాల ఉత్పత్తులతో అనేక రకాల ఆహార ఉత్పత్తులను తయారు చేసే ప్రక్రియ మొదలైందన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సంతోష్‌నగర్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): టీఎస్ఎస్‌పీడీసీఎల్ సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని 11కేవీ న్యూనాగోల్, హనుమాన్‌నగర్, గోటెట్టి ఫంక్షన్‌హాల్, సాయినగర్, జైన్‌మందిర్, కమలనగర్ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో నిర్వహణపనుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరా నిలిపి వేయబడుతుందని డీఈ తెలిపారు. న్యూనాగోల్ ఫీడర్ పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, హనుమాన్‌నగర్, గోటెట్టి ఫంక్షన్‌హాల్, సాయినగర్ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 11నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, హనుమాన్ నగర్, సాయినగర్, గోటెట్టి ఫంక్షన్ హాల్ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు, జైన్‌మందిర్, కమలానగర్ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన తెలిపారు.

మాల మహానాడు డివిజన్ అధ్యక్షుడిగా భిక్షపతి


మరాఠి భిక్షపతి

హయత్‌నగర్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ డివిజన్ మాల మహానాడు అధ్యక్షుడిగా మరాఠి భిక్షపతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా కోదండ సురేష్, గౌరవ అధ్యక్షులుగా కడారి పెంటయ్య, కోదండ లక్ష్మీదాసు, సంఘీ సహదేవ్, గోరంటి యాదయ్య, సంఘీ జంగయ్య, కోదండ సత్యనారాయణ, దేవా ముత్యాలు, ఉపాధ్యక్షులుగా సంఘీ రాజు, బండి నరేష్, కడారి కుమార్, సంఘీ అశోక్, కోశాధికారులుగా కోదండ అవినాష్, కడారి బలరాం, సహాయ కార్యదర్శులుగా బొంతల శ్రీకాంత్, వల్లపోజు దాసు, కడారి సుధాకర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మాలమహానాడు డివిజన్ అధ్యక్షుడు మరాఠి భిక్షపతి మాట్లాడుతూ మాలల హక్కుల కోసం కృషి చేస్తానని అన్నారు.

మార్కెట్‌లో ధరలను సూచించే డిజిటల్ స్క్రీన్ బోర్డులు


మిర్చియార్డ్‌లో ఏర్పాటు చేసిన డిజిటల్ స్క్రీన్‌బోర్డు

ఓల్డ్‌మలక్‌పేట : ప్రభుత్వం మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి కొనుగోలు యార్డ్‌లో ధరలను సూచించే డిజిటల్ స్క్రీన్ బోర్డులను ఏర్పాటు చేసింది. మార్కెట్‌లో రైతులు తెచ్చిన ధాన్యానికి పలుకుతున్న ఈనామ్ ధరలను ఎప్పటికప్పుడు డిజిటల్ స్కీన్ బోర్డుల ద్వారా ప్రదర్శిస్తారు. ధరల్లో అవకతవకలు జరగకుండా పారదర్శకంగా అమ్ముకునేందుకు వీలుగా డిజిటల్ స్క్రీన్ రైతులకు ఎంతగానో ఉపయోగపడతాయి. మార్కెట్‌లో ఎకరం ధాన్యం ఏ రేటు పలుకుతుందో డిజిటల్ బోర్డులు సూచిస్తాయి. రైతులు డిజిటల్ బోర్డు చూసి నేరుగా ధరల వివరాలు తెలుసుకునే వీలుంది. మార్కెట్‌లో ధాన్యం ఈ రోజు ఎంత ధర పలుకుతుందనే విషయం రైతులు ఎవరిని అడగాల్సిన అవసరం లేకుండా నేరుగా డిజిటల్ స్క్రీన్ వైపు చూస్తే తెలిసిపోతుంది. మార్కెట్ మిర్చి యాడ్‌లో రెండు స్క్రీన్‌లను ఏర్పాటు చేశారు. ఇంకా ఇవి అందుబాటులోకి రాలేదు. స్క్రీన్‌లు మాత్రమే అమర్చారు. రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తాయని మార్కెట్ ఎస్‌జీఎస్ దామోదర్ తెలిపారు.

బాలాపూర్‌లో హోర్డింగ్స్ తొలగింపు !

● అనుమతులు ఉన్నా తొలగిస్తున్నారని యజమానుల ఆరోపణ

● అక్రమంగా పెట్టినవే తీసేస్తున్నామంటున్న హైడ్రా

సరూర్‌నగర్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేశారంటూ హోర్డింగ్‌లను తొలగించడానికి హైడ్రా అధికారులు, సిబ్బంది ప్రయత్నించడంతో మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని బాలాపూర్ చౌరస్తాలో ఆదివారం కాసేపు ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. మీర్‌పేట్ కార్పొరేషన్ పరిధిలో మునిసిపల్ ఆదాయానికి గండి కొడుతూ విచ్చల విడిగా వెలిసిన పలు హోర్డింగ్‌లపై ఇటీవల పలువురు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. మునిసిపల్ అధికారులు సైతం దీనిపై హైడ్రాకు ఓ నివేదిక అందజేసినట్టు తెలిసింది. ఈ క్రమంలో ఆదివారం హైడ్రా అధికారులు, సిబ్బంది మీర్‌పేట్‌లోని బాలాపూర్ చౌరస్తాలో భవనాలపై వెలిసిన భారీ హోర్డింగ్‌ల తొలగింపునకు ఉపక్రమించారు. విషయం తెలుసుకున్న తెలంగాణ అవుట్ డోర్ మీడియా అసోసియేషన్ సభ్యులు(హోర్డింగ్‌ల యజమానులు) అక్కడకు చేరుకుని హైడ్రా అధికారులను అడ్డుకున్నారు. తమకు అన్ని అనుమతులు ఉన్నాయని, అనుమతులు ఉన్న వాటిని ఎలాంటి నోటీసు ఇవ్వకుండా ఎలా తొలగిస్తారని నిలదీశారు. అయితే తమ దృష్టికి వచ్చిన అక్రమంగా వెలిసిన హోర్డింగ్‌లను మాత్రమే తాము తొలగిస్తున్నామని, నిబంధనల మేరకు ఉన్న వాటి జోలికి వెళ్లడంలేదని అధికారులు స్పష్టం చేశారు. కాగా ఏ ఒక్క హోర్డింగ్ కూడా తొలగించడానికి వీల్లేదని, ముందుగా నోటీసులు ఇచ్చి ఆ తర్వాత మాత్రమే చర్యలు చేపట్టాలంటూ అసోసియేషన్ సభ్యులు హైడ్రా అధికారులను అడ్డుకున్నారు. దాంతో కొంతసేపు బాలాపూర్ చౌరస్తాలో ఉద్రిక్త వాతావరణం తలెత్తి, ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

హైకోర్టు చెప్పినా మారరా..?

ఆదివారం, ఇతర సెలవు రోజుల్లో కూల్చివేతలు, తొలగింపులు చేపట్టవద్దంటూ హైకోర్టు ఇటీవల హైడ్రాను ఆదేశించిందని, అయినప్పటికీ మళ్లీ ఆదివారమే హైడ్రా అధికారులు బాలాపూర్ చౌరస్తాకు రావడంలోని ఆంతర్యమేమిటని అవుట్‌డోర్ మీడియా అసోసియేషన్ సభ్యులు ప్రశ్నించారు. తమ జీవనాధారమైన హోర్డింగ్‌లను తొలగిస్తే తాము అప్పులపాలై రోడ్డున పడాల్సి వస్తుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. తొలగించిన హోర్డింగ్ మెటీరియల్ ఎంతో విలువైనదని, దానిని హైడ్రా అధికారులు అక్రమంగా అమ్ముకుంటున్నారని అసోసియేషన్ సభ్యులు ఆరోపించారు. సీఎం ఈ విషయంపై ప్రత్యేక దృష్టి పెట్టి తమను ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. లేనట్టయితే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని వారు హెచ్చరించారు.


హైడ్రా అధికారులతో వాగ్వాదానికి దిగిన హోర్డింగ్‌ల యజమానులు